# ప్రణవ పద్మాకరం





ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

మే, 2024





## అక్షయ తృతీయ శుభాకాంక్షలు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

మే, 2024

సంపుటి-3

సంచిక-5

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 04 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 05 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 06 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 08 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 09 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 10 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 11 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |

శ్రీ మహాగణాధిపతయే నమః　　శ్రీ గురుభ్యోనమః　　శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం

## తీర్థయాత్ర



భగవంతుడు ఫలానా చోటే ఉన్నాడు, మరొకచోట లేడనుకోవటం అసాధక లక్షణం. ఆయన అంతటా ఉన్నాడనే స్పృహ కలగడమే జ్ఞానం. గురువుల వల్ల ఈ జ్ఞానం కలుగుతుంది అది ముక్తికి కారణం అవుతుంది. అప్పుడు భగవంతుడు అంతటా కనిపిస్తాడు. అందుకే వశిష్ఠమహర్షి శ్రీరామచంద్రుడితో ఇలా పలికాడు -

శ్లో॥ రాగద్వేషతమః క్రోధ మదమాత్సర్య వర్జనమ్
వినా, రామ! తపోదానం, క్లేశఏవ న వాస్తవమ్॥

(వశిష్ఠ - రామ సంవాదము, వాల్మీకి, అ 6 .శ్లో. 10)

రామా!కామక్రోధలోభమోహమదమాత్సర్యాలను త్యజించకుండా ఎన్ని తపోదానాలు చేసినా శ్రమ మిగులుతుంది తప్ప సంపూర్ణ ఫలితం లభించదని వశిష్ఠమహర్షి అంటాడు. అరిషడ్వర్గాలనే కలుపు మొక్కలను తొలగించి మనఃక్షేత్రాన్ని పవిత్రం చేసుకుంటే భక్తి అనే కల్పవృక్షం పెరుగుతుంది. ఆ కల్పవృక్షం వల్ల ఇహపరాలు రెండు లభిస్తాయి. భక్తి మార్గంలో తీర్థయాత్రలు ముఖ్యమైనవి. తీర్థయాత్రలను ఏ విధంగా చేయాలో, ఎలా చేస్తే ఫలితం లభిస్తుందో మనకు భజగోవిందంలోని ఈ శ్లోకం తెలియజేస్తుంది.

శ్లో॥ కురుతే గంగాసాగరగమనం, వ్రతపరిపాలనమథవా దానమ్।
జ్ఞానవిహీనః సర్వమతేన, ముక్తిం న భజతి జన్మశతేన ॥

( భజగోవిందం: శ్లో.18 )

ఎన్ని పుణ్యతీర్థాలు దర్శించుకొన్నా, మన మనస్సులో మార్పు రానంత కాలం ఫలితమేమి ఉండదు. గంగానదిలోనూ, సముద్రంలోనూ స్నానం చేసినా, వ్రతాలు ఆచరించినంతమాత్రమున 'జ్ఞానం' లేని వారికి ఎన్ని జన్మలెత్తినా ముక్తి లభించదు. పవిత్ర దేవాలయ క్షేత్రాలను కొందరు విహారయాత్ర ప్రాంతాలుగా భావిస్తుంటారు అందుకే తీర్థయాత్రలకు కూడా ఏదో పర్యాటకకేంద్రాలకు వెళ్ళినట్లుగా వెళ్ళి అక్కడ నదిలోనో, సాగరంలోనో మునిగి, జ్ఞాపకంగా నాలుగు ఛాయచిత్రాలు దిగి వచ్చేస్తుంటారు. దీని వల్ల వచ్చే ఫలితం ఏమీ ఉండదు. ఆ ప్రాంతాలలో శరీరసౌకర్యాల కోసం

ప్రయత్నిస్తుంటారు. అలాకాకుండా ఆయా క్షేత్రాలలోని ఆధ్యాత్మిక శక్తిని మనలోకి ఆవాహన చేసుకోవాలంటే ఆయా క్షేత్రాలను భక్తితో, విశ్వాసంతో దర్శించుకోవాలి. మన ఆర్భాటాలు, హోదాలు అన్నింటిని పక్కనపెట్టి భగవంతుని చరణాలను ఆశ్రయించాలి. అక్కడే ఏకాంతంగా కొంతసేపు జపధ్యానాధులను ఆచరించాలి. మనఃస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థించుకోవాలి. ఆర్తితో స్వామిని వేడుకోవాలి. అప్పుడే యాత్ర ప్రభావం భక్తులపై ఉంటుంది. ఆచారాల అంతరార్థాలను తెలుసుకోవాలి. జపమంత్రాల పరమార్థాలను అర్థం చేసుకోవాలి. ఆయా తీర్థస్థలాలమాహాత్మ్యాలను మననం చేసుకొంటూ పవిత్రసాధన చేయాలి. తద్వార మనస్సులో కలిగేటువంటి వికారాలను తొలగించుకోవాలి. సాధనలేవి చేయకుండా మోక్షం కోరుకోవడం వెఱ్ఱితనం అని దత్తాత్రేయుడు సెలవిచ్చాడు. శ్రీకాళహస్తీశ్వర శతకంలోని ధూర్జటి మహాకవి చెప్పిన పద్యం కూడా దానికి తార్కాణము.

శా॥ విత్తజ్ఞానము పాదు చిత్తము భవావేశంబు రక్షాంబువుల్
మత్తత్వంబు తదంకురంబనృతముల్ మాఱాకులత్యంత దు
ర్వృత్తుల్పువ్వులు పండ్లు మన్మథముఖావిర్భూతదోషంబులున్
జిత్తాభ్యున్నత నింబ భూజమునకున్ శ్రీకాళహస్తీశ్వరా!

శ్రీకాళహస్తీశ్వరా! నా మనస్సు వేపచెట్టు లాంటివి. దీనికి పాదు ధనము పై ఆశ, అహంకారము నీరు, మదము దీని మొలకలు, అసత్యములు మారాకులు. అత్యంత దుష్ప్రవర్తన పువ్వులు, మన్మథ దోషాలు పండ్లు. కవి శ్రీ కాళహస్తీశ్వరుని తన మనసు అనే వేప చెట్టును కల్పవృక్షముగా మార్చమని చెప్పకుండానే చెబుతున్నాడు.

నారదపురాణంలో మహాత్ముల సంపదలను కల్పవృక్షఫలాలతోనూ పాపాత్ముల సంపదలను వేపపళ్ళతోనూ వ్యాసుడు పోల్చి, మహాత్ముల సంపదలను దేవతల వంటి వారు స్వీకరిస్తారనీ, పాపాత్ముల సంపదలను కాకుల వంటి వారు అనుభవిస్తారని అభివర్ణించాడు.

శ్లో॥ అహో సదుపభోగాయ సజ్జనానాం విభూతయః,
కల్పవృక్షః ఫలాఢ్యోఽపి దేవైరేవోపభుజ్యతే. ॥

(నారదపురాణం..అ.36. శ్లో.19)

శ్లో॥ అసతాముపభోగాయ దుర్జనానాం విభూతయః,
పిచుమందః ఫలాఢ్యోఽపి కాకైరేవోపభుజ్యతే.

(నారదపురాణం..అ.36. శ్లో.13)

తీర్థయాత్రాసమయంలో భక్తి, శ్రద్ధలతో గురుదర్శనం, దేవదర్శనం వంటి వాటిని విడిచి పెట్టకుండా ఉంటే సంపూర్ణతీర్థయాత్రాఫలం లభిస్తుంది. తీర్థయాత్రాఫలం వల్ల ముందు ఇహము తర్వాత పరము లభిస్తాయి. తీర్థయాత్రాసమయంలో మనం వ్యాసశిష్యుల వలె ప్రవర్తించాలి. కాశీకి వెళ్ళినప్పుడు వ్యాసుడు కోపగించినా, శిష్యులు ఏ మాత్రం కోపం పొందలేదు. గురువుగారిని కోపాన్ని విడిచిపెట్టమని ప్రార్థించారు తప్ప గురువులోని లోపం వెదుకలేదు. తప్పు పట్టలేదు. జ్ఞానులు ఏ పరిస్థితులలోనూ గురునింద చేయరు. గురువుల లోపాలు వెదుకరు. దానికే 'సంయమనము' అని పేరు. సంయమనము వల్ల సంపూర్ణతీర్థయాత్రాఫలం లభిస్తుంది. ఒక వ్యక్తి ఎంత సాధకుడైన గురుభక్తి వలననే తరిస్తాడు. కనుక సాధకులందరూ గురుభక్తి కలిగి తీర్థయాత్రలు చేస్తూ ఇహపర సౌఖ్యాలు పొందగలరని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.

వద్దిపర్తి పద్మాకర్

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# మధుమేహం పై కార్యశాల


పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి దివ్య సంకల్పంతో,శ్రీ ప్రణవపీఠం — విద్యానిధి అంతర్జాలంలో మధుమేహం గురించి Endocrinologist doctors


Dr Swapna Aradhyula Garu , Rockford VPS

Dr Jyothi Gogineni Garu

Dr.Asha Kasaraneni Garu

సూచనలు మరియు సలహాలు పై 28.04.2024, ఆదివారం సాయంత్రం 5.00 గంటలకు భారత కాలమానం ప్రకారం కార్యశాల నిర్వహించబడింది.ఇందులో ఎంతో మంది పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకుని వైద్యులయొక్క సలహాలు,సూచనలు తీసుకున్నారు.ఈ సదావకాశాన్ని కల్పించిన శ్రీగురువుగారి తో పాటు డాక్టర్లకు వారు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేశారు.




## వైద్యులు అందించిన సూచనలు

1.డయాబెటిస్ రెండు రకాలు ఉంటాయి.ఒకటి టైప్ వన్ రెండు టైపు టు

2.టైప్ వన్ అనేది చిన్నపిల్లల్లో ఎక్కువగా రావచ్చు . టైప్ టు అనేది మన లైఫ్ స్టైల్ వలన వస్తుంది.

3.డిటెక్ట్ చేసుకోవడానికి రెగ్యులర్గా మనము 30 దాటిన తర్వాత ప్రతి సంవత్సరము లేదా మూడు సంవత్సరాలగానే అట్లా ఇంటర్వెల్లో బ్లడ్ షుగర్ టెస్ట్ చేయించుకోవాలి.దాని వల్ల మనకు షుగర్ ఉండేది లేనిది తెలుస్తుంది.

4.ప్యాంక్రియాస్ తయారు చేసే ఇన్సులిన్ యొక్క తరుగుదలన వలన మనకు షుగర్ వ్యాధి వస్తుందిఇన్సులిన్ మనం తినే చక్ర పదార్థాలను విడగొడుతుంది.ఎప్పుడైతే బాడీలో ఇన్సులిన్ లెవెల్స్ తగ్గిపోతాయో మనలో చక్కెర నిల్వలు పెరిగి మనకు అది షుగర్ వ్యాధిగా పరిణామం చెందుతుంది.


5.షుగర్ ఎక్కువైనప్పుడు అది మూత్రం ద్వారా బయటికి రిలీజ్ అవుతుంది కాబట్టి మూత్ర పరీక్ష చేసుకున్న మనకు షుగర్ ఉన్నది లేనిది తెలుస్తుందిషుగరు ఒకసారి వచ్చిన తర్వాత నయం అవడం జరగదు.

6.కావున జీవితకాలం మందులతోనూ మరియు మన చక్కని అలవాటు వలన షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు.

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ గణేశ పురాణం



ఒకప్పుడు దేవేంద్రుడు పుష్పభద్రానదీతీరానికి వెళ్ళాడు. తాను త్రిలోకాధిపతిననీ, సంపదలు కలవాడననీ, మహామహిమకలవాడననీ ఆయనకు గర్వం అధికమయ్యింది. ఆ సమయంలో ఆయన చేరుకొన్న పుష్పభద్రానదీతీరంలో ఒక పూలతోట ఉంది. అది పరమసుందరంగా, రమణీయంగా క్రూర జంతువులు లేకుండా ఉంది. అక్కడి వాయువులు పరమ సువాసనతో ఉన్నాయి. ఆ దివ్య ప్రకృతి, ఆహ్లాదకరమైన వాతావరణం, ఏ ప్రాంతంలోనూ కనపడదు. చంద్రలోకం వెళ్ళి నృత్యం చేసి, మన్మథుడు ఆహ్వానించగా అతని ఆశ్రమానికి ఆ సమయంలో అక్కడకు వచ్చింది రంభ. సౌందర్యవతి, కామశాస్త్రనిపుణ అయినది రంభ. మన్మథుని ఆహ్వానంపై అతని వద్దకు పోతున్న రంభను ఇంద్రుడు చూచాడు — ఎక్కడికి పోతున్నావు? రంభా! బహుకాలానికి కనిపించావు. నీ కోసమే నేను అన్వేషిస్తున్నాను. నిన్ను కాక ఇతర స్త్రీలను కోరుకొనేవాడు, పరమ మూర్ఖుడు. అమృతం విడచి కల్లు త్రాగేవాడు, పూలను విడచి ముళ్ళు కోరుకొనేవాడు, స్వర్గం విడచి నరకం కోరుకొనేవాడు, ఆభరణాలు విడచి, ఇనుమును కోరువాడు, ఎటువంటి వాడో నిన్ను విడచి అన్యస్త్రీని కోరువాడు అటువంటివాడు. నన్ను కాదనకు, నాతో సుఖించు. ఈ విధంగా పలికి ఇంద్రుడు రంభతో సుఖించాలనే కోరికతో ఐరావతం దిగాడు. ఇంద్రుని మాటలు విని రంభ కూడా చిరునవ్వుతో ఆయన కోరిక తీర్చాలనుకొన్నది. నీ మాట కాదనలేను అన్నది. నేను నీ దాననే అన్నది. సరిగ్గా, ఆ సమయంలో దుర్వాసుడు వైకుంఠం నుండి కైలాసానికి వెడుతూ అక్కడికి వచ్చాడు. పారిజాత పుష్ప మాలికను శ్రీమహావిష్ణువునకు సమర్పించి, ఆయనను పూజించి, శేషమాలను తిరిగి తనకే ఇవ్వగా, ఆమాలను చేతపట్టుకొని ఉన్నాడు దుర్వాసుడు. దేవేంద్రుడు ఆయనను చూచి నమస్కరించాడు. అప్పుడు దుర్వాసుడు శ్రీమహావిష్ణువు తనకిచ్చిన పారిజాతమాలను దేవేంద్రునకు ఇచ్చాడు. కామమోహితుడు, సంపదహంకారి అయిన ఇంద్రుడు, ఆ మాలను తన ఏనుగు తలపైకి విసిరాడు. అది చూచిన దుర్వాసుడు ఆగ్రహించాడు. ఈ పూలమాల సకల విఘ్నాలను తొలగిస్తుంది. "ఇది నారాయణునికి సమర్పింపబడినది. దీని తలపై ధరించిన వానికి ప్రథమ పూజ లభిస్తుంది. లక్ష్మీదేవి అతనిని అనుగ్రహించి సంపదలిస్తుంది. ఈ పుష్పం తలపై ధరించిన వాడు జ్ఞానంలో, తేజస్సులో, బుద్ధిలో, విక్రమంలో, బలంలో శ్రీమన్నారాయణునితో సమానుడవుతాడు. సర్వదేవాధికుడు, హరితుల్యపరాక్రముడు అవుతాడు. భక్తితో శిరస్సున ధరించక అహంకరించి, ఈ పుష్పమాలను తిరస్కరించిన పామరుడు, హరినివేదనాన్ని తినని వాని వలె, భ్రష్టుడవుతాడు.

...ఇంకా ఉంది

*****

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## శ్రీ వెంకటాద్రి పై నరసింహస్వామి - శివునితపస్సు



నిజానికి భగవంతునికి గుణరూపకర్మాదులు లేవు. భక్తుల కోసం గుణరూపకర్మములు స్వీకరించి, అనేక నామధేయాలతో, అనేక రూపాలతో, అనేక లీలలతో అనుగ్రహిస్తుంటాడు. అందుకే భాగవతంలో బ్రహ్మ, శివుడు, విష్ణువు, గణపతి, అమ్మవారు - ఇలా అనేక రూపాలతో, అనేక ఆగమశాస్త్ర విధులతో అర్చింపబడే పరబ్రహ్మం ఒకడే అని నారదునికి వివరిస్తాడు. తానే నృసింహరూపంలో, శివరూపంలో ఉండి, తనను తాను అర్చించి, సేవించి లోకానికి మార్గదర్శనం చేస్తుంటాడు ఆ పరబ్రహ్మ. ఒకప్పుడు శంకరుడు సతీవియోగానంతరం, సతి పార్వతిగా జన్మించినపుడు అక్కడకు వచ్చాడు. నరసింహస్వామి వారిని తులసీదళాలతో, బిల్వపత్రాలతో, చామంతి పూలతో పూజించాడు. సర్వనదీనదజలాలతో అభిషేకించాడు. దధ్యన్నం, హరిద్రాన్నం, గూడాన్నం, స్నిగ్ధాన్నం, ముద్గోదనం, పానకం, వడపప్పు ఆయనకు నివేదించాడు. [దధ్యన్నం - పెరుగుతో చేయబడిన అన్నం, హరిద్రాన్నం - పసుపు కలిపిన అన్నం — పులిహార, గుడాన్నం- బెల్లంతో వండిన అన్నం, స్నిగ్ధాన్నం - నేతితో మృదువుగా వండిన అన్నం — కట్టుపొంగలి. ముద్గోదనం - పెసరపప్పుతో వండిన పులగం.] పరిపరి విధాలుగా శివుడు నరసింహుని స్తుతించగా నారసింహుడు ప్రసన్నుడై, శీఘ్రకాలంలో పార్వతిని వివాహం చేసుకొని లోకపితరునిగా ప్రసిద్ధి పొందుతావని శివునకు వరం ఇచ్చాడు. శివునిచే ఆరాధింపబడి, శివునకు వరాలిచ్చిన ఆ స్వామి శ్రీ నీలకంఠనరసింహస్వామిగా ప్రసిద్ధి చెందాడు.

ఈ కథను దేవలునికి దేవదర్శనుడు వివరించగా, దేవలుడు ఆనందంతో తాను కూడా నారసింహుని అర్చించాడు. దేవలుడు గురుభక్తి కలిగిన సాధకుడు. అందువల్లనే కొండపై నారసింహుని అర్చిస్తున్నప్పుడు, ఆయనను ప్రత్యక్షంగా దర్శిస్తున్న అనుభూతిని పొందేవాడు. ఆ సమయంలో అక్కడకు ఒక స్త్రీ వచ్చింది. ఆమె శరీరమంతా పుండ్లు పడి రసి కారుతోంది. ముఖం వికృతంగా ఉంది. ఆమెను చూడలేక వేంకటాచలానికి వస్తున్న భక్తులు అసహ్యించుకొని పొమ్మంటున్నారు. ఆమె శరీరం నుండి దుర్వాసన వస్తున్నది. నీలకంఠనరసింహస్వామి ఆలయానికి కొంచెం దూరంలో దేవలుడు, కొండగుహలో నివసిస్తున్నాడు. కొన్నాళ్ళు ఆ గుహలో ఉండి వేంకటాద్రినివాసం చేసి, నారసింహుని అర్చించి అక్కడనుండి తిరిగి వెళ్ళాలని అతని సంకల్పం.

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## సత్యభామ రుక్మిణి



విదర్భ దేశాన్ని భీష్మకుడు అనే రాజు. పరిపాలిస్తుండేవారు. ఆయనకు రుక్మి, రుక్మధరుడు, రుక్మబాహుడు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు అనే ఐదుగురు కుమారులూ, రుక్మిణి అనే ఒక కూతురూ వున్నారు. వారందరికీ రుక్మిణి చెల్లెలు. ఆమె లక్ష్మీదేవి అంశతో పుట్టింది. మహా గుణవంతురాలనీ, సౌందర్యరాశి అనీ ప్రసిద్ధి పొందింది. భీష్మకుని ఇంటికి ఎప్పుడూ అనేకమంది అతిథులు వస్తుండేవారు. వారు యాదవ శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని లీలలనూ గుణగణాలనూ కథలు కథలుగా చెబుతుండేవారు. అవన్నీ వినడంవల్ల రుక్మిణికి బాల్యంలోనే శ్రీకృష్ణుని మీద అభిమానం ఏర్పడింది. పెద్దయ్యేసరికి అది ప్రేమగా మారింది. మాధవుడికే తాను భార్య కావాలని రుక్మిణి గట్టిగా నిర్ణయించుకుంది.రుక్మిణీదేవి అందచందాలను గురించీ, గుణగణాలను గురించి శ్రీకృష్ణుడు కూడా విన్నాడు. ఆమెను వివాహం చేసుకోవాలని పట్టుదలగా వున్నాడు. రుక్మిణి పెద్ద అన్నగారైన రుక్మి మాత్రం తన చెల్లెలు రుక్మిణిని చేది దేశపు రాజైన శిశుపాలుడికి యిచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించాడు. అన్నగారి నిర్ణయం రుక్మిణీదేవికి దుఃఖం కలిగించింది. వెంటనే తనకు ఆప్తుడైన పురోహితుడు అగ్నిద్యోతనుడ్ని పిలిచి శ్రీకృష్ణుడికి తన ప్రేమను తెలియచేయమనీ ప్రార్థించింది. ఆయనకు రకరకాల బహుమానాలూ, కానుకలూ ఇచ్చి ద్వారావతి కి పంపింది. ద్వారావతి చేరుకున్న అగ్నిద్యోతనుడు కృష్ణుడ్ని కలుసుకుని రుక్మిణి పక్షాన ఆమె చెప్పమన్నవన్నీ చెప్పాడు. మాధవదేవుని మీద రుక్మిణికి గల ప్రేమానురాగాలను పూసగుచ్చినట్లు నివేదించాడు. రుక్మిణి నిర్ణయాన్ని గురించి కూడా చెప్పాడు. 'కృష్ణా! నువ్వు అతిలోక సుందరుడవు. లీలామానుష స్వరూపుడవైన నిన్ను శ్రీదేవి తనకు తానై వరించింది. అదే నీ త్రిజగన్మోహనత్వానికి నిదర్శనం. అందుకే రుక్మిణి నీ చరణదాసి అయింది. అంతఃపురంలో వుండే తాను నిన్ను చేరుకునే ఉపాయం కూడా ఆ కన్యే చెప్పింది' అని రుక్మిణి పంపిన సందేశాన్ని అగ్నిద్యోతనుడు శ్రీకృష్ణుడికి అందచేశాడు. 'స్వామీ! నువ్వు వచ్చి శిశుపాల, జరాసంధులను ఓడించి నన్ను నీ దాన్నిగా చేసుకో. చతురంగ బలాలతో రా. అయితే నా బంధువులకు చేటు వాటిల్లకుండా వుండేందుకు ఒక ఉపాయం చెబుతాను. రేపు వివాహమనగా ముందురోజు వధువు స్వయంగా వెళ్ళి కులదేవత అయిన 'సర్వ మంగళ'ను కొలవటం మా ఆచారం. మా కులదేవతను సేవించేందుకు నన్ను మావాళ్ళు నగరం వెలుపలికి తీసుకువెడతారు. అక్కడికి నువ్వు వచ్చి నన్ను చేపట్టు మాధవా' అని శ్రీకృష్ణుడిని వేడుకుంది రుక్మిణి.

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 331. వరదా [ఓం ఐం హ్రీం శ్రీం వరదాయై నమః]



వరములను ఇచ్చునది కనుక అమ్మను 'వరద' అన్నారు. చరాచర జగత్తులోని సర్వ ప్రాణులకు కోరిన వరాలను అమ్మవారు మాత్రమే ఇస్తుంది. 'వరద' అనే పేరుతో ఒక నది ఉన్నది. ఇది కర్ణాటకలో ఉన్నది. ఈ నదీ రూపంలో ప్రవహిస్తున్నది కూడా అమ్మవారే. ఆ నదిగా ఉండి అందరికీ జీవన దానం చేస్తున్న అమ్మవారు వరద. వరద అనగా కన్యక అని కూడా అర్థం. కన్యకా రూపంలో ఉండునది వరద. దుర్గ అని కూడా మరొక అర్థం. దుర్గారూపంలో కాపాడునది. వర శబ్దానికి శ్రేష్ఠము అని అర్థం. శ్రేష్ఠత్వాన్ని అనగా గొప్పతనాన్ని జీవులకు ఇచ్చునది వరద.

### మంత్రప్రయోగవిధానం — ఫలితం

సాటివారిలో గొప్పతనాన్ని పొందాలన్నా, కోరిన కోరికలు తీర్చుకోవాలన్నా ఈ మంత్ర సాధన చేయాలి. పక్షులకు రోజూ గుప్పెడు బియ్యం లేక పెసలు లేక జొన్నలు ఆహారంగా పెడుతూ 90 దినములు ఈ మంత్రాన్ని దినమునకు 108 నుండి 1000 వరకు జపిస్తే అనుకొన్న వరాలు లభిస్తాయి.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

**ఓం ఐం హ్రీం శ్రీం వరదాయై నమః**

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఋషి చరిత్ర

## అత్రి మహర్షి

పుత్రులు పెరుగుతుండగా అత్రి మహర్షి అనసూయని పిలిచి సాధ్వి! నీవు కోరుకున్నట్లుగా సత్పుత్రులు ఉదయించినారు. నేను ఇక తపస్సు చేయాలని కోరుకుంటున్నాను। నీవు నాతో ఉంటావా లేక ఈ బిడ్డల దగ్గర ఉంటావా అని అడిగాడు? అనసూయ వినయ విధేయతలతో మహాత్మా! పుత్రులింకను పెరిగి పెద్దవారు కాలేదు. ఇప్పుడే వారిని విడుచుట ధర్మం కాదు. కావున వీరి పోషణార్థం పృథు చక్రవర్తి దగ్గరికి వెళ్ళి అర్థమును అనగా సొమ్మును తీసుకొని రండి అని పలికినది. అటు పిమ్మట వానప్రస్థాశ్రమమునకు వెళదామని కోరినది. మహర్షి కూడా ఆమె మాటలలోని ఉన్నటువంటి ధర్మవిధానాన్ని అనుసరించాడు. పృథు చక్రవర్తి చేయుచున్న అశ్వమేధ యాగమునకు వెళ్ళాడు. అక్కడ పృథు చక్రవర్తి యాగాశ్వమును విడిచి దానిని రక్షించుకొనుటకు తన కొడుకుని పంపుతూ అత్రిమహర్షిని అతనికి సహాయంగా వెళ్ళమని ప్రార్థించగా దానికి అంగీకరించి బయలుదేరాడు. పృథుచక్రవర్తి యాగవైభవం చూడలేక ఇంద్రుడు మాయావేషమున యాగాశ్వమును అపహరించి ఆకాశంలోకి వెళ్ళాడు. అత్రి మహర్షి సహాయంతో అతనిని అనుసరించి యుద్ధం చేయగా ఇంద్రుడు అశ్వమును విడిచి పారిపోయాడు. రాజకుమారుడు అశ్వమును తీసుకొని వచ్చుచుండగా ఇంద్రుడు మరలా దాన్ని అపహరించాడు. కానీ అత్రి మహర్షి సహాయంతో పృథురాజకుమారుడు ఇంద్రుని తరిమి అశ్వమును తీసుకొని వచ్చాడు. పృథు చక్రవర్తి బ్రాహ్మణులకు అనేక దక్షిణలు ఇచ్చి అత్రి మహర్షిని ఇంద్రుడని చంద్రుడనీ కీర్తించాడు. అతనికి అనేక ధన కనక వస్తువాహనములను ఇచ్చి సత్కరించాడు. మహర్షి వాటిని తీసుకొని వెళ్ళి పుత్రులకు పంచి ఇచ్చి వారికి యుక్తవయస్సు రాగానే భార్యా సమేతుడై వానప్రస్థాశ్రమమునకు బయలుదేరాడు.అత్రిమహర్షి అత్రిసంహిత అనే పేరుతో కర్మప్రతిష్ఠాపూజనస్నాపనోత్సవ ప్రాయశ్చిత్తములను విభాగముల క్రింద అనేక విషయములను వివరించాడు. మొదటి భాగములో దేవాలయ స్థల పరిశీలనము, దేవాయతన రూపము, దైవ ప్రతిమానిరూపణము మొదలగు విషయాలను, రెండవ భాగములో ప్రధాన పరివార దేవత ప్రతిష్ఠాధికములు, మూడవ భాగంలో పూజా విధానమును, నాలుగో భాగంలో మహాభిషేక వివరణము, ఐదవ భాగంలో ఉత్సవ విశేషములు ప్రత్యేక ఉత్సవ విశేషములు వాటి నిబంధనలను, ఆరవ భాగములో పూర్వోక్త విధానమునందలి దోషాధికములకు ప్రాయశ్చిత్తములు వివరించబడినవి. ఈ ప్రకారంగా అత్రిమహర్షి దేవతార్చన విధానమును లోకమునకు చాటి పరమేశ్వరుపాసనమును, ఉపాయములను మానవాళికి ప్రసాదించెను. అత్రిస్మృతి లేక ఆత్రేయధర్మశాస్త్రము పేరిట అత్రిమహర్షి ప్రోక్తమైనటువంటి ధర్మశాస్త్రము కలదు. వీనిలో ప్రాయశ్చిత్తములు, దానములు, పితృ మేధము, ఆచారములును, గురుప్రశంస. చాతుర్వర్ణ ధర్మములు, జపమాలాపవిత్రత, బ్రాహ్మణుల కుండవలసిన శౌచానసూయాది సుగుణములు, ఇష్టా పూర్త నిర్వచనము, యమనియమములు, పుత్రులు, దత్తపుత్రులు, ప్రాయశ్చిత్తములు, అశౌచము. చాంద్రాయణకృచ్ఛ్ర శాంతపనములు, మొదలగు విషయములు కలవు. అవి ఈ కాలమునకు కూడా వర్తించేవిధముగా కలవు.

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# కాశీ కథలు




మహాదేవుడు బ్రహ్మ కూడా తిరిగి రాకపోయేసరికి ఉద్విఘ్నుడు అయ్యాడు. సృష్టికర్త బ్రహ్మ కూడా కాశీ పట్టణమును వదిలి రాలేకపోయాడు, ఇది కాశీ మహిమ తప్ప మరొకటి కాదు అని శివుడు భావించాడు. యోగినీ దేవతలు ఆ తర్వాత సూర్యభగవానుడు ఇప్పుడు బ్రహ్మ ఎవ్వరు కూడా నేను అప్పగించిన కార్యమును పూర్తి చేయక కాశీలోనే ఉండిపోయారు అని మహాదేవుడు తలచాడు. మహాదేవుడు ఈ విధముగా ఆలోచించి తన ప్రథమ గణములను పిలిచాడు. ఓ ప్రమథ గణములారా మీరు వెంటనే కాశీకి వెళ్ళండి,అక్కడ నేను పంపిన యోగినీ దేవతలు, సూర్యుడు, బ్రహ్మ ఏమి చేస్తున్నారో తెలియచేయండి. ఈ విషయమును చెబుతూ శివుడు ప్రమథ గణముల నామములను కూడా పలికాడు. ఓ!శంఖుకర్ణ, మహాకాల, ఘంటకర్ణ,మహోదర సోమ, నంది, నందిసేన, కాల, పింగళ, కుక్కుట, కుంభోదర, మయూరాక్ష, బాణ, గోకర్ణ, తారక, తిలపర్ణ, స్థూలకర్ణ,దూమిచండ, ప్రభామయ, సుఖేశ, విందతి, ఛాగ, కపర్ది, పింగళాక్ష, వీరభద్ర, కిరాత, చతుర్ముఖ,నికుంభ, పంచాక్ష్య, భారభూత, త్ర్యక్ష, క్షేమక, ల్లాంగ్లీ, సుముఖ, విరాధ, ఆషాడ మీరందరూ గణేశుడు, కార్తికేయుడు లాగా నాకు పుత్రులు వారికన్నా మీరు నాకు ఎక్కువ. నైగమేయుడు, శాఖుడు, విశాఖుడు, నంది,బృంగి వంటి వారితో నేను ఎంత స్నేహముతో ఉంటానో మీతో కూడా అంతే ప్రీతిపాత్రముగ ఉంటాను. మీరంతా మహాపరాక్రమవంతులు.మీలో కాలమునకన్నా మించిన శక్తి కలిగిన వారు శంఖుకర్ణుడు, మహాకాలుడు మీరు ఇరువురు తక్షణమే కాశీ వెళ్ళి అక్కడి విషయాలను తెలుసుకొని శీఘ్రముగా రండి అని శివుడు పలికెను.

...ఇంకాఉంది

*****

# స్తోత్రమాలిక

## హనుమాన్ ద్వాదశనామ స్తోత్రమ్

హనుమాన్ అంజనాసూనుః వాయుపుత్రో మహాబలః

రామేష్టః ఫల్గున సఖః పింగాక్షో మిత విక్రమః

ఉదధిక్రమణశ్చైవ సీతాశోక వినాశకః

లక్ష్మణప్రాణ దాతాచ దశగ్రీవస్య దర్పహా

ద్వాదశైతానినామాని కపీంద్రస్య మహాత్మనః

స్వాపకాలే పఠేన్నిత్యం యాత్రాకాలే విశేషతః

తస్య మృత్యు భయంనాస్తి సర్వత్ర విజయీభవేత్ |


*****



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# గురుదేవుల జీవన కవనము

## సప్తదశ అధ్యాయము



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారు పురాణ ప్రవచనముల ద్వారా ఎందరినో ధర్మం,ఆధ్యాత్మికత వైపు నడిపించారు, నడిపిస్తున్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట వారు పురాణములను ప్రవచిస్తూ ఉంటారు.వారు అందించిన వేంకటేశ్వర మాహాత్మ్యం అద్భుతం అపురూపం. మంథని లో 2007 వ సంవత్సరంలో వారు ప్రవచించిన శ్రీనివాసుని లీలలు విన్న వారికే ఆ అనుభూతి తెలుస్తుంది.శ్రీనివాసుని గురించి చెప్తూ నిత్యం శ్రీనివాసుని వక్షస్థలం పై ఉండే వ్యూహ లక్ష్మీ మహిమను వారు తెలియజేసారు. వ్యూహలక్ష్మిని భక్తితో తలుచుకుంటే చాలు ఆ తల్లి అనుగ్రహమును ప్రసాదిస్తుంది. కలియుగం లో జీవులకు భక్తి తక్కువ, శ్రీ గురువుగారు తెలియజేసిన అమ్మ వైభవం వింటే చాలు లక్ష్మీ దేవి తన భక్తుల గృహంలో శాశ్వతముగా కొలువుతీరుతుంది. ఆత్మారాముడికి లక్ష్మి సమేతముగా శ్రీవారు దర్శనము ఇచ్చిన ఘట్టము గురించి గురువుగారు ద్వారా విన్న భక్తులు తరించిపోయారు, గురువుగారు వారి వాక్కుతో భక్తులకు శ్రీనివాసుడిని దర్శించుకునే భాగ్యం భక్తులకు కలిగించారు. రామద్వేషి కూడా రామ భక్తునిగా మారే విధంగా హైదరాబాద్లో వారు ప్రవచించిన రామాయణం చారిత్ర్యాత్మకము. సీతా మాత గురించి వారు చెప్తుండగ భక్తుల కంట నీరు వచ్చేది.శ్రీమద్దేవీ భాగవతం లో వారు అందించిన మణిద్వీప వర్ణన విన్న వారు తప్పకుండ అమ్మ అనుగ్రహముతో మణిద్వీపమునకు చేరుకుంటారు.వారు ప్రవచించిన ప్రతి చోటు ఒక దివ్య క్షేత్రంగ మారింది. వారు అమ్మ గురించి చెబితే 64 కోట్ల యోగినీ దేవతలు కూడా వచ్చి వింటారు.గురుదేవుల పాండిత్యం గురించి, మహిమ గురించి ఎంతని చెప్పగలం ఏమని చెప్పగలం. అమెరికా, యూరోప్, పశ్చిమ ఆసియ ప్రాంతం ఏదైనా గురుదేవులు పురాణములను భక్తులకు అందించారు. తెలుగు వారిని భారత దేశమునకు దూరంగా ఉన్నవారిని వారి ప్రవచనములతో ధర్మమును బోధించారు.

....ఇంకా ఉంది

*****

శ్రీ ప్రణవపీఠం వారి
విద్యా నిధి
ఏలూరు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


శ్రీ ప్రణవపీఠం వారి

## గుడి-బడి

ఏలూరు

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో గురు భక్తులు అందరూ భక్తి తో గుడి-బడి కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్న దాన కార్యక్రమములు యథా శక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.

